క్లుప్తంగా

బీసీల సంక్షేమానికి సీఎం జగన్ పెద్ద పీట



తిరువూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక బైపాస్‌రోడ్డు సెంటర్లో తిరువూరు నియోజకవర్గ యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నామినేటెడ్ పదవుల్లో, మంత్రి పదవుల్లో బీసీలకే తొలి ప్రాధాన్యత ఇచ్చిన ముఖ్యమంత్రి యాదవ కులానికి ప్రత్యేక గుర్తింపు ఇచ్చారన్నారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుధారాణి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బీసీలకు కల్పించిన సంక్షేమ పథకాలను వివరించారు. నియోజకవర్గ యాదవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు యరదేశి రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘ నాయకులు కాలసాని చెన్నారావు, గుమ్మా పాపారావు, చిమటా రామకృష్ణ, కోమటి చెన్నారావు, పాలం గోపాలరావు, దొంగల నరసింహారావు, జంగాల శ్రీనివాస్, ముత్తయ్య, మల్లేశ్వరరావు, వైకుంఠరావు, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ నాని పర్యటన

తిరువూరు: విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని శ్రీనివాస్ (నాని) సోమవారం తిరువూరు నియోజకవర్గంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉదయం 10 గంటల నుంచి ఏకొండూరు మండలంలోని రామచంద్రాపురం, చీమలపాడు, రేపూడి, కోడూరు గ్రామాల్లో సచివాలయాలు, ఆర్బీకేలు, వైఎస్సార్ హెల్త్ సెంటర్ భవనాలను ఎంపీ ప్రారంభిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి తిరువూరు మండలం చిట్టేల, మునుకుళ్ళ, వామకుంట్ల, కొమ్మిరెడ్డిపల్లి, చింతలపాడు గ్రామాల్లో సచివాలయాలు, ఆర్బీకే భవనాలను నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసుతో కలిసి ప్రారంభిస్తారు.

నేడు ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవం

ఏ.కొండూరు: మండలంలోని పలు గ్రామాల్లో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ భవనాలను సోమవారం విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని), వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు ప్రారంభిస్తారని జెడ్పీటీసీ భూక్య గనియా తెలిపారు. రామచంద్రాపురం, రేపూడి గ్రామాల్లో సచివాలయ భవనాలు, చీమలపాడులో హెల్త్ క్లినిక్ సెంటర్, రైతు భరోసా కేంద్రం, కోడూరులో రైతు భరోసా కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

వ్యక్తిపై కేసు

ఇబ్రహీంపట్నం: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఓ మహిళను వేధింపులకు గురిచేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఫెర్రీ డౌన్‌కు చెందిన ఓ గృహిణి స్థానిక వెయిట్ లాస్ సంస్థలో కొంత కాలం పనిచేసింది. ఆ సమయంలో అక్కడే పనిచేస్తున్న దేరంగుల రాజేష్‌తో చనువుగా మాట్లాడేది. ఈమధ్య కాలంలో వ్యక్తిగత కారణాలతో ఉద్యోగం మానేసింది. తనతో ఫోన్‌లో మాట్లాడటం లేదని దేరంగుల రాజేష్ మహిళ వెంటపడి వేధించడం మొదలు పెట్టాడు. అతని చేష్టలు తట్టుకోలేక ఫిబ్రవరి 29న పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ బి.అనూష విచారణలో నిందితుడు మహిళలను వేధించడం రుజువు కావడంతో శనివారం రాత్రి కేసునమోదు చేసినట్లు ఎస్ఐ అనూష ఒక ప్రకటనలో తెలిపారు.

6న నియోజకవర్గ కార్యాలయం ప్రారంభం

తిరువూరు: వైఎస్సార్‌సీపీ తిరువూరు నియోజకవర్గ కార్యాలయాన్ని ఈ నెల 6న ప్రారంభించనున్నట్లు ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి తెలిపారు. విజయవాడ రోడ్డులోని అయ్యప్ప స్వామి ఆలయం ఎదురుగా ఏర్పాటు చేసిన ఈ కార్యాలయాన్ని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ ప్రారంభించనున్నట్లు తెలిపారు.

బార్ మూసివేత

తిరువూరు: స్థానిక బస్టాండు సెంటర్లో తెలంగాణ మద్యం విక్రయిస్తున్న బార్ అండ్ రెస్టారెంటును స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు ఆదివారం సీజ్ చేశారు. తెలంగాణ నుంచి తెచ్చిన మద్యాన్ని ఈ బార్‌లో విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఈబీ అధికారులు శనివారం రాత్రి నుంచి తనిఖీలు చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తెలంగాణ మద్యం సీసాలను తెచ్చి అమ్ముతున్నట్లు నిర్ధారించిన అధికారులు బార్‌ను మూసివేయించారు.

వార్షికోత్సవం

చాట్రాయి: ప్రాథమిక స్థాయి నుంచి నైపుణ్యం కలిగిన విద్యను బోధించాలని పోలవరం పీపీసీఎస్ చైర్మన్ చెలికాని బాబ్జీ అన్నారు. శనివారం రాత్రి స్థానిక కేపీ ప్రాథమిక పాఠశాల 19వ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం చిన్నారులు పలు రకాల వేషధారణలతో ప్రదర్శనలు, నృత్యాలు పలువురిని అలరించాయి. ఎంఈవో బ్రహ్మాచారి, హెచ్ఎం ఆర్ నాగేశ్వరరావు, పాఠశాల చైర్మన్ పేరం సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని ఆదరించండి

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



సురవరంలో విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభించిన ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి: ప్రజలకు మంచి చేస్తున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలంతా మళ్లీ ఆదరించి గెలిపించాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఆదివారం సురవరంలో రూ.3 కోట్ల 50 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో సురవరం, కొమ్మూరు, కృష్ణవరం గ్రామల్లో లోవోల్టేజీ సమస్యతో రైతులు అనేక ఇబ్బందులు పడేవాళ్లని, ఇప్పుడు సురవరంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించడం వలన వ్యవసాయానికి రైతులు ఉదయం పూటే 9 గంటలు ఆటంకాలు లేకుండా విద్యుత్ వాడుకోవచ్చని తెలిపారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు కేజీ బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన ప్రజలు నమ్మే పరిస్థితులు లేదన్నారు. పేదల పక్షపాతిగా నిలిచిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేయడంతో గ్రామాల రూపురేఖలు మారిపోయాయన్నారు. మళ్లీ సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని కోరారు. విద్యుత్ శాఖ అధికారి ఎస్ఈ మురళీమోహన్‌రావు మాట్లాడుతూ సురవరంలో విద్యుత్ సబ్ స్టేషన్ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కృషి వల్లే సాధ్యమైందని తెలిపారు. పలువురు రైతులు ఎమ్మెల్యేను సత్కరించారు. వైస్ ఎంపీపీ కొండ వరదల రమేష్, జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, ఈఈ సత్యనారాయణ, రవి కిషోర్, డీఈ ఈ పోతురాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు, సర్పంచ్‌లు గరికపాటి వీరా వెంకటేశ్వరరావు, కోనూరు ఏసు, కమ్మిలి రాంబాబు, ఎస్ ఎస్ దిలీప్, ఎంపీటీసీ పరసా కోటేశ్వరరావు, పార్టీ నాయకులు ఈలప్రోలు సుబ్బయ్య, గొళ్ళఇస్సాకు, భాస్కర్ ప్రసాద్, మహిళలు పాల్గొన్నారు.



తుమ్మగూడెంలో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్

జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి..

ముసునూరు: ప్రజా మన్ననలతో జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కానున్నారని, ఆయన పాలనలో పల్లె రహదారులన్నీ రాజమార్గాలుగా మారాయని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఆదివారం ఎంపీపీ కొండా దుర్గా భావాని అధ్యక్షతన మండలంలోని చింతలవల్లి శివారు గోగులంపాడు నుంచి నూజివీడు మండలం ముక్కొల్లుపాడు వరకు రూ.4.10 కోట్ల నాబార్డ్ నిధులతో నిర్మించనున్న ఐదు కిలోమీటర్ల పొడవైన రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వ్యవసాయ సొసైటీ వద్ద జెడ్పీటీసీ డాక్టర్ వరికూటి ప్రతాప్ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. 600 హామీలు ఇచ్చి, ఆరు కూడా అమలు చేయని వారి మాటలు నమ్మవద్దని, జగనన్నకే సంపూర్ణ మద్దతును ఇవ్వాలని కోరారు. వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ స్వరూపరాణి, మౌలిక వసతుల కల్పన స్టేట్ డైరెక్టర్ కలగర వెంకటేశ్వరరావు, స్థానిక సర్పంచ్ పిల్లి సత్యనారాయణ, ఎంపీటీసీ సుధాకర్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు నాగవల్లేశ్వరరావు, గ్రామ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్, వ్యవసాయ సొసైటీ అధ్యక్షుడు ఎస్ వెంకటేశ్వరరావు, పీఆర్ ఏఈ రాఘవేంద్రరెడ్డి, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలుగ్రామాల పార్టీ అధ్యక్షులు, పార్టీ నేతలు, అభిమానులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యం

చాట్రాయి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రోడ్ల నిర్మాణాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు స్పష్టం చేశారు. ఆదివారం మండలంలోని తుమ్మగూడెం నుంచి ముసునూరు మండలం సూరేపల్లి వరకు రూ.2 కోట్లతో చేపట్టే బీటీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఏపీ కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, గ్రామ సర్పంచి మొలుగుమాటి మారమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి చల్లగుళ్ల జగన్‌మోహనరావు, నాయకులు దామెర ప్రసాదు బాబు, కారంగుల వాసు, మాదల నరశింహారావు, మోరంపూడి నాగేశ్వరరావు, చల్లగుళ్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్ పోస్టర్ విడుదల



పోస్టర్‌ను విడుదల చేస్తున్న సర్నాల తిరుపతిరావు, వైఎస్సార్ సీపీ నేతలు

మైలవరం: విజయవాడలో ఏర్పాటు చేసిన స్టాచ్యూ ఆఫ్ సోషల్ జస్టిస్ జాతికి అంకితం చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని మైలవరం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు కార్యాలయంలో ఆదివారం అభినందన సభ ఏర్పాటు చేశారు. విజయవాడ స్వరాజ్ మైదానంలో రూ.404 కోట్ల వ్యయంతో నిర్మించిన 206 అడుగుల సామాజిక న్యాయ శిల్పం, భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని జాతికి అంకితం చేసిన దళిత బాంధవుడు ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు, ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు జే గంగాధరరావు, వైఎస్సార్ సీపీ మైలవరం మండల అధ్యక్షుడు జీ వెంకట్రావు, నాయకులు పాల్గొన్నారు.

పల్స్ పోలియో విజయవంతం



గొల్లపూడిలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని, డాక్టర్



తిరువూరులో పోలియో చుక్కలు వేస్తున్న స్వామిదాస్



వెల్వడంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న తిరుపతిరావు

ఇబ్రహీంపట్నం: మైలవరం, తిరువూరు, నూజివీడు నియోజకవర్గాల పరిధిలో ఆదివారం నిర్వహించిన పోలియో చుక్కల కార్యక్రమం విజయవంతం అయింది. ఇబ్రహీంపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కొండపల్లి పీహెచ్‌సీ పరిధిలో పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించారు. కొండపల్లి పీహెచ్‌సీ పరిధిలోని గొల్లపూడిలో డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని, కొండపల్లిలో డీఎల్‌వో ఉషారాణి పల్స్‌పోలియో కేంద్రాలు సందర్శించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పీహెచ్‌సీ పరిధిలో 5,776 మంది చిన్నారులకు గాను 5660 మందికి 98 శాతం చుక్కలు వేశారు. డాక్టర్లు ఆర్.పద్మావతి, కౌన్సిలర్ బి.నాగరాజకుమారి పోలియో చుక్కలు వేశారు. ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీ పరిధిలో 5,797 మంది చిన్నారులకు గాను 5,702 మందికి వేసి 98.36 శాతం తొలిరోజు పూర్తి చేశారు. కౌన్సిలర్ నల్లమోతు లక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు పోలియో చుక్కలు వేశారు. గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కొండపల్లిలో మున్సిపల్ కౌన్సిలర్లు పోలియో డ్రాప్స్ కార్యక్రమం ప్రారంభించారు.

నూజివీడు: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పోలియో కేంద్రంలో ఆదివారం మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకట రామిరెడ్డి, ఇన్‌చార్జి డెప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ జాస్తి జగన్ మోహన్‌రావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, మాజీ వైస్ చైర్మన్ పగడాల సత్యన్నారాయణ, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు లాం ప్రసాదరావు, వైద్యులు సౌమ్య, సురుచి, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఏ.కొండూరు: మండలంలోని పలు గ్రామాల్లో 99 శాతం పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా జరిగిందని వైద్యాధికారి వి.స్వాతి ఆదివారం తెలిపారు. ఏ.కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి ప్రారంభించారు. 36 పోలింగ్ బూత్‌లలో మొబైల్ టీం ద్వారా 3,174 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. మిగిలిన చిన్నారులకు ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారన్నారు. ఆయా గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రూట్ సూపర్వైజర్ దయామణి, పద్మావతి హెల్త్ అసిస్టెంట్లు సువర్ణరాజు పర్యవేక్షించారు.

చాట్రాయి: మండలంలో అన్ని గ్రామాల్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం విజయవంతం చేశారు. ఐదేళ్లలోపు వయస్సు పిల్లలు 3,459 మందికి పోలియో చుక్కలు వేశారు. మిగిలిన పిల్లలకు సోమ, మంగళవారాల్లో వేయనున్నట్లు పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాసరెడ్డి తెలిపారు. బూరుగుగూడెంలో ఏఈ కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, పోలవరంలో చెలికాని బాబ్జీ, సర్పంచ్ సత్తెనపల్లి లక్ష్మి, చాట్రాయిలో దామెర ఉషా, నరశింహారావుపాలెంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు: పల్స్ పోలియో కార్యక్రమాన్ని మండలంలో ఆదివారం నిర్వహించారు. 41 కేంద్రాల్లో ఆరు వేల మంది చిన్నారులకు చుక్కల మందు వేసినట్లు అధికారులు తెలిపారు. పట్టణంలో పల్స్ పోలియో కేంద్రాలను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు ప్రారంభించారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, వెంకటేశ్వరి, కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, మూడు దుర్గారావు, మోదుగు ప్రసాద్, తంగిరాల వెంకటరెడ్డి, పరసా సత్యనారాయణ, చిన్నారి, సుందరకుమార్, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ రేగళ్ళ మోహనరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రెడ్డిగూడెం: మండలంలో ఐదేళ్లలోపు చిన్నారులకు ఆదివారం పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సందేష్ మాట్లాడుతూ మండలంలోని 3826 మంది చిన్నారులకు గాను 3787 మందికి పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. అందులో సమస్యాత్మక ప్రదేశాల పిల్లలు 114 మందికి గాను 108 మందికి పోలియో చుక్కలు వేశామన్నారు. సోమవారం ఇంటింటికీ తిరిగి పోలీయో చుక్కలు వేయించుకోని వారికి చుక్కలు వేస్తారని చెప్పారు.

జి.కొండూరు: మండల పరిధిలో ఆదివారం నిర్వహించిన పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమానికి డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మండల పరిధిలో పోలియో చుక్కలను టార్గెట్‌కు మించి వేసినట్లు మండల వైద్యాధికారిణి డాక్టర్ శిరీష చెప్పారు. మండలంలో 5,533 మంది చిన్నారులకు పోలియో చుక్కలను వేసేందుకు 30 కేంద్రాలను ఏర్పాటు చేయగా ఆదివారం 5,809 మందికి పోలియో చుక్కలను వేసినట్లు వివరించారు. వెల్లటూరు, కుంటముక్కల, చిన్ననందిగామ పరిధిలోని ఇటుక బట్టీలలో పని చేసేందుకు వచ్చిన వలస కార్మికుల పిల్లలకు చుక్కలను వేయడం వలన టార్గెట్‌కు మించిందని చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గంపలగూడెం: మండలంలోని ఊటుకూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో ఆదివారం నిర్వహించిన సామూహిక పల్స్‌పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమంలో 98.7 శాతం చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు పీహెచ్‌సీ వైద్యులు శశిప్రియ, సురేష్ తెలిపారు. 0–5 వయస్సు పిల్లలు 2,132 మందికి పోలియో చుక్కలు వేయాలని నిర్ణయించగా 2,106 మందికి చుక్కల మందు వేసినట్లు వైద్యులు తెలిపారు. ఆరోగ్యకేంద్రం సిబ్బంది, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది తమ సేవల్ని అందజేశారు.

విస్సన్నపేట: మండలంలోని తెల్లదేవరపల్లిలో ఆదివారం పల్స్‌పోలియో కేంద్రం వద్ద ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి చిన్నారులకు పోలియోచుక్కలు వేశారు. గ్రామ సర్పంచ్ రాయల నాగరాణి పాల్గొన్నారు. మండలంలో పల్స్‌పోలియో కార్యక్రమం 98 శాతం పూర్తి అయినట్లు డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. విస్సన్నపేట గ్రామ సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఒకటవ వార్డులో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు చిన్నారులకు పోలియోచుక్కలు వేశారు. కార్యక్రమంలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తిరువూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం పిల్లలకు పోలియో వ్యాక్సిన్ వేశారు. మునుకుళ్ళలో ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, చౌటపల్లిలో జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, మల్లేలలో పీఏసీఎస్ చైర్మన్ కలకొండ రవి కుమార్ పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో నాగేశ్వరరావు కాకర్ల, లక్ష్మీపురం, కోకిలంపాడు గ్రామాల్లో పల్స్ పోలియో పరిశీలించారు. చౌటపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి పూజిత, కనకదుర్గ భవానీ, భాను మనోజ్, రేష్మా, వీ చలపతిరావు, శ్రావ్య పర్యవేక్షణలో పల్స్ పోలియో నిర్వహించారు.

ముసునూరు: రెండు చుక్కల పోలియో వ్యాక్సిన్‌తో చిన్నారులను అంగవైకల్యం బారినుంచి కాపాడవచ్చని ఎంపీపీ కొండా దుర్గాభవాని అన్నారు. ఆదివారం మండలంలోని రమణక్కపేట పీహెచ్‌సీ పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఎంపీపీ ప్రారంభించారు. ముసునూరు పీహెచ్‌సీలో చిన్నారులకు తహసీల్దార్ జవహర్ బాజి పోలియో చుక్కలు వేశారు. మండల వ్యాప్తంగా పల్స్‌పోలియో వివరాలను వైద్యాధికారులు షకీనా ఇవాంజిలిన్, కరీముల్లా వెల్లడించారు. ముసునూరు పీహెచ్‌సీ పరిధిలో 2,426 చిన్నారుల లక్ష్యానికి గాను, 2,439, రమణక్కపేట పీహెచ్‌సీ పరిధిలో 2,226 చిన్నారులకు గాను 2,208 మందికి పోలియో చుక్కలు వేశారు. మండలంలో మొత్తం 4652 చిన్నారులు లక్ష్యం కాగా 4,647 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు వారు తెలిపారు. బలివే ఉత్సవాలకు వలస వచ్చిన వ్యాపారుల, దుకాణాదారుల పిల్లలకు కూడా పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారిణి ఇవాంజిలిన్ చెప్పారు.

నూజివీడు: పట్టణంతోపాటు నూజివీడు మండలంలో ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమంలో 98.5 శాతం మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద పోలియో కేంద్రంలో ఆర్డీఓ వై. భవానీశంకరి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మండలంలో దిగవల్లి, గొల్లపల్లి పీహెచ్‌సీలు, పట్టణంలో కోనేరుపేట, బంగినపల్లితోట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు పల్స్‌పోలియో విధులను నిర్వహించారు. వైద్యాధికారులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

మైలవరం: మండలంలో ఆదివారం ప్రారంభించిన పల్స్ పోలియో 98 శాతం పూర్తయినట్లు చంద్రాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. పల్స్ పోలియో కార్యక్రమం సోమవారం, మంగళవారం కూడా కొనసాగుతుందన్నారు. ఇంటింటికీ సర్వే చేసి చిన్నారులకు పోలియో చుక్కలు వేయిస్తామన్నారు. జిల్లా అధికారి డాక్టర్ ఉషారాణి, మెడికల్ ఆఫీసర్ అరుణకుమారి, డాక్టర్ చలపతిరావుతో కలిసి మైలవరంలో నిర్వహిస్తున్న పోలియో చుక్కల కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చంద్రాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

వెల్వడం(మైలవరం): చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి వారి నిండు జీవితాన్ని కాపాడుకోవాలని వైఎస్సార్‌సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు తెలిపారు. మండలంలోని వెల్వడం గ్రామంలో చంద్రాల ప్రాథమి ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యంలో పల్స్ పోలియో కేంద్రంలో ఆదివారం సర్నాల తిరుపతిరావు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. వైఎస్సార్‌సీపీ వెల్వడం గ్రామ పార్టీ అధ్యక్షుడు యరమల నరసింహారెడ్డి, నాయకులు తోట తిరుపతిరావు, ఐసీడీఎస్ సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు. మైలవరంలో సీడీపీఓ పుష్పలత, పుల్లూరు గ్రామంలో ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, చంద్రాలలో డాక్టర్ ప్రియాంక, పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో జొన్నలగడ్డ గంగాధరరావు తదితరులు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మండలంలో మొత్తం 38 బూత్‌ల ద్వారా పోలియో చుక్కలు వేయించినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారిణి ప్రియాంక తెలిపారు. వాహనాలు ఏర్పాటు చేసి హైరిస్క్ ఏరియాలు, నాలుగు రహదారుల కూడళ్ళు, ఇటుకబట్టీలలో చిన్నారులకు పోలియో చుక్కలు వేయించామన్నారు.

ఆగిరిపల్లి: అడవినెక్కలంలో పల్స్ పోలియో కేంద్రాన్ని డెప్యూటీ డీఎంహెచ్‌ఓ జాస్తి జగన్‌మోహన్ రావు పరిశీలించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఆగిరిపల్లి, ఈదర, సగ్గురు పీహెచ్‌సీ వైద్యాధికారులు టీనా, నాగ జ్యోత్స్న, మంజుల దేవి పల్స్ పోలియో కేంద్రాలను పరిశీలించారు. ఆగిరిపల్లిలో 2206 చిన్నారులకు లక్ష్యం కాగా 2154 మందికి, ఈదరలో 1396 మందికి లక్ష్యం కాగా 1375 మందికి, సగ్గురులో 1840 మంది లక్ష్యం కాగా 1826 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారులు చెప్పారు. ఆగిరిపల్లిలో ఎంపీటీసీ సాదం గోపి, ఎంఈఓ సర్వేశ్వరరావు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కేంద్ర పోలీసు బృందాల కవాతు



ఇబ్రహీంపట్నంలో సీఐఎస్ఎఫ్ బృందాలకు శిక్షణ ఇస్తున్న కమాండెంట్ హిమాన్స్, సీఐ

ఇబ్రహీంపట్నం: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర సీఐఎస్ఎఫ్ నుంచి 100 మంది సభ్యులను ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు కేటాయించారు. విజయవాడ కమిషనరేట్ పశ్చిమ డివిజన్ పరిధిలో వీరు ఎన్నికల విధులు నిర్వహిస్తారు. స్టేషన్‌కు చేరిన కేంద్ర బృందాలకు ఆడిటోరియం వద్ద ఆదివారం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. సీఐఎస్ఎఫ్ కమాండెంట్ హిమాన్స్, సీఐ ఎం.సత్యన్నారాయణ ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. బందోబస్తులో భాగంగా భద్రతా చర్యలపై పలు సూచనలు చేశారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్..

స్టేషన్ పరిధిలోని రౌడీ, సస్పెక్ట్ షీటర్లు, గంజాయి విక్రయదారులు, స్మోకర్లకు డీసీపీ కృష్ణకాంత్‌పాటిల్, ఏసీపీ మురళీకృష్ణారెడ్డి ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. శాంతిభద్రలకు విఘాతం కలుగకుండా సమాజంలో జీవనం సాగించాలని సూచించారు. ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐ ఎం.సత్యన్నారాయణ పాల్గొన్నారు.

మైలవరం: ఎన్నికల నిర్వహణకు పోలీస్, పారా మిలిటరీ బలగాలు సిద్ధంగా ఉన్నాయని మైలవరం ఏసీపీ మురళీమోహన్ తెలిపారు. త్వరలో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో విజయవాడ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు రూరల్ జోన్ డీసీపీ సూచన ప్రకారం మైలవరం గ్రామంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి నూజివీడు రోడ్డు బైపాస్ రోడ్డు వరకు ప్రధాన రహదారులలో పోలీసులు, పారా మిలిటరీ బలగాలు కవాతు నిర్వహించారు. ఏ క్షణంలోనైనా ఎన్నికల కోడ్ రావచ్చని, ఎన్నికలకు పోలీస్ బలగాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. మైలవరం నియోజకవర్గానికి 90 మందిని నియమించారని తెలిపారు. సెన్సిటివ్ ఏరియాలపై దృష్టి పెడుతున్నట్లు ఏసీపీ తెలిపారు. మైలవరంలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా రోడ్డు పక్కన ఉన్న తోపుడు బళ్లు తొలగించి పది గజాలు దూరంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీఐ కిశోర్‌బాబు, ఎస్ఐ హరిప్రసాద్ పాల్గొన్నారు.

జి.కొండూరు: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రతా చర్యలను కట్టుదిట్టం చేస్తున్నట్లు మైలవరం సర్కిల్ ఏసీపీ మురళీమోహన్ అన్నారు. ముందస్తు భద్రతా చర్యలలో భాగంగా జి.కొండూరులో కేంద్ర సాయుధ బలగాలతో కలిసి స్థానిక పోలీసులు ఆదివారం సాయంత్రం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఇప్పటికే పోలింగ్ కేంద్రాలను పరిశీలించి భద్రతా ఏర్పాట్లకు ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. సీఐ కిశోర్‌బాబు, ఎస్ఐ షబ్బీర్ అహ్మద్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



ట్యాంకర్ నీటిని పంపిణీ చేస్తున్న స్వామిదాసు

తిరువూరు: పట్టణంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు హామీ ఇచ్చారు. పట్టణంలోని సుందరయ్య కాలనీలో ఆదివారం పర్యటించిన ఆయన తాగునీటి ఇబ్బందులు పరిశీలించారు. రక్షితమంచినీటి పథకం ద్వారా నీటి సరఫరా వేసవిలో సరిపోనందున ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నారని, త్వరలో కృష్ణా నదీ జలాలను పైలట్ ప్రాజెక్టు కింద అందిస్తామన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఈ పథకానికి రూ.140 కోట్లు మంజూరు చేసిందని, ఎన్నికలు ముగిసిన తదుపరి ప్రాజెక్టు పనులు పూర్తిచేస్తామన్నారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరి, కౌన్సిలర్లు తంగిరాల వెంకటరెడ్డి, పరసా శ్రీనివాసరావు, సుందరకుమార్, గుంటూరు మస్తాన్, రాజ్ మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో విజేతలు

గంపలగూడెం: తోటమూల జేవీ అకాడమీ, విశిష్ట జూనియర్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మండల స్థాయి ప్రభుత్వ పాఠశాలల్లోని పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్‌టెస్ట్‌లో స్థానిక జిల్లా జెడ్పీ స్కూలుకు చెందిన ముగ్గురు విద్యార్థులు మొదటి మూడు స్థానాల్లో మార్కులు సాధించారు. విజేతలైన కే హరిణి, పీ లిఖిత, కే ఈశ్వర్‌లకు రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు, మెమెంటోలను జేవీ అకాడమీ ప్రతినిధులు అందజేశారు. ఊటుకూరు జేవీ సిద్ధార్థ, తోటమూల సరస్వతీ విద్యాలయాల ప్రిన్సిపాల్స్ చెరుకూరికృష్ణారావు, శ్రీనివాసరావు, ఎస్.కల్పన పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఆగిరిపల్లి: మండలంలోని ఈదర, గోపాలపురం, ఈదులగూడెంలోని పోలింగ్ కేంద్రాలను నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ ఆదివారం పరిశీలించారు. ఎన్నికల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఎస్సై సురేంద్ర కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే జైలే

తిరువూరు: ఎన్నికల సమయంలో ఎటువంటి నేరాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని స్థానిక ఎస్ఐ సత్యనారాయణ రౌడీషీటర్లను హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషనులో పాత నేరస్తులు, రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. గతంలో నేరస్తులుగా ముద్రపడిన వారి కదలికలపై పోలీసు నిఘా ఉంటుందని, మళ్లీ నేరాలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు రౌడీషీటర్లు పోలీసు స్టేషన్లో హాజరు వేయించుకోవాలని ఆదేశించారు.